




# స్మృతుల కొలనులో కలువ

**ఉన్నట్టుండి** కళ్లు తెరిచి చూస్తే నా పక్కన చిట్టెమ్మ లేదు. అంతే గబుక్కున లేచి చుట్టూ చూశాను చిమ్మ చీకటి దానికి తోడు వణుకు పుట్టిస్తున్న చలి. చిట్టెమ్మ వంటగదిలో ఇత్తడిపళ్లెంలో పసుపు కుంకుమ, పూలు సర్దుతా కనిపించింది.

నాకు అర్ధమైపోయింది తెల్లారగట్ట చెరువు దగ్గరికి స్నానాలు చేయటానికి ప్రతి కార్తీకమాసం మా నాయనమ్మ అమె తోటివాళ్లు వెళ్తారు.

నేను చిట్టెమ్మని వదిలి వుండను కాబట్టి అంత చలిలోనూ వణుక్కుంటూ బయల్దేరతాను. " ఎందుకే ! నీ ఈడు పిల్లలంతా హాయిగా ముణగదీసుకు పడుకుంటే నువ్వు ఎమ్మటపడి వస్తావు? " అన్నా నేను వింటేగా.

అసలు ఎప్పుడూ మా నాయనమ్మ పక్కనే ఎప్పుడూ పడుకుంటా. ఏ రాత్రి అయినా పని అంతా అయినాక స్నానం చేసి చాకి రేవులో వుతికి తెచ్చిన చీర కట్టుకుంటుంది. మా నాయనమ్మని వాటేసుకుని పడుకుంటే ఆ చీర కమ్మటి వాసన ఎంత బాగుంటుందో.

తను ఎప్పుడైనా పొరపాటున తమ్ముడిని పడుకోబెట్టుకుంటే వాడిని తాత దగ్గరికి పంపేవరకు అలుగుతాను.

ఒక రోజు నేను ఏదో పెళ్లికి పెద్దనాన్న తో వెళ్లి వచ్చేసరికి నాయనమ్మ, తమ్ముడు దగ్గర పడుకునే సరికి వుడుకుమోతుతనంతో అలిగి నేల మీద పడుకున్నాను. కానీ తెగ నిద్దర పోతూ వాళ్లు పట్టించుకుంటేగా!

కాసేపు అరుగు మీద పడుకుందామని అప్పుడైనా ఎవరైనా " ఇక్కడ పడుకున్నావేంటే ?" అని అడిగితే నెను అలిగిన విషయం తెలుస్తుందని ఆశపడ్డాను. కానీ ఎవరైనా లేస్తేనా ! ఎవరూ చూడనప్పుడు అలక సీను ఎందుకులెమ్మని ఖాళీ మంచం ఎక్కి పడుకుని నిద్దర పోయాను. నేను అలిగిన సంగతి మర్నాడు నేనుకూడా మర్చిపోయాను .

చిట్టెమ్మతో పాటే ఆ నెల్లాళ్లూ స్నానాలకి వెళ్లాల్సిందే. ముందుగా నాయనమ్మ చాకలి ఎంకాంని పిలుస్తుంది. ఎంకాం కి భక్తి చాలా ఎక్కువ ఎంకాం వాళ్ల ఆయన దేముడి పల్లకి దగ్గర కాగడా పట్టుకు నడిచే లక్ష్ముడు . అందుకేనేమో తనకి అంత భక్తి .

సుక్కమ్మామ్మ, నాగమణెమ్మ, ఇంకా చాలా మంది ఆడాళ్లు తుడుచుకునే తుండు, బట్టలు పట్టుకుని స్నానాలకు బయలుదేరేవారు.

ఊరంతా నిద్రపోయినట్టు వున్నప్పుడు ఈ ఆడంగులు ఏవేవో కబుర్లు చెప్పుకుంటా చెరువు దగ్గరికి చేరే వారు, నీళ్లల్లో మూడుసార్లు మునిగి పైకి లేస్తే అంత చలి ఎక్కడకి పారిపోయేదో !

స్నానాలు అయ్యాక తిరిగి వెళ్తూ తోకమల్లి పూల చెట్టు దగ్గరికి వచ్చేసరికి చెట్టుకిందంతా తెల్ల దుప్పటి పరిచినట్టు పూలు. ఆ పూలన్నీ పోగు చేసి తుండు నిండా పోసి మూటకట్టి తెచ్చి వాటితో మాల కట్టి బొమ్మలాటకి అట్టిపెట్టుకుంటాను. అప్పటికి తెల్లవారుతూ వుంటుంది. చెరువుకి అవతలవున్న చేలన్నీ పొగమంచు వెనకాల దాక్కుంటే , రాత్రి విచ్చుకున్న ఎరుపు, తెలుపు కలువపూలతో చెరువు భలేగా వుంటుంది .

ఎప్పుడూ పొద్దున్నే నిద్ర లేవని నాకు సూర్యుడు ఇంత బాగుంటాడా అనిపిస్తుంది. సూర్యుడు మా చెరువులో తన అందాన్ని తొంగి చూసుకుంటున్నట్టుంటుంది .

కార్తీకమాసంలో మా నాయనమ్మ బియ్యం, పప్పులు వూర్లో కుర్రాళ్లతో పోగు చేయించి కమ్మటి వంటలు చేసి సంతర్పణ చేసేవారు.

ఇక కార్తీక మాసం ఆఖరి రోజు పోలిని స్వర్గానికి పంపే పూజలో ఆడాళ్లు వదిలిన అరటి దొప్పల్లో దీపాలతో మా చెరువు వెలిగిపోయేది. నిజంగా స్వర్గం ఇట్లాగే వుంటుందా అన్నట్టుండేది.

నా చిన్నప్పటి మా వూరు గుర్తొస్తే స్మృతుల కొలనులో కలువగా వికసిస్తాను.

*(వచ్చేనెల మరో కథ)*

Post your comments